

కోతకు గురవుతున్న తీరం

జిల్లాలో తీరప్రాంతం అధికంగా ఉండడంతో శీతల గాలులు తోడయ్యాయి. సముద్రం అల్లకల్లోంగా మారింది. సుమారు ఆరుమీటర్ల ఎత్తులో అలలు ఎగిసి పడ్డాయి. గార మండలం బందరువానిపేట వద్ద, మందస మండలం గంగువాడ వద్ద సుమారు పది మీటర్ల మేర సముద్రం ముందుకు వచ్చింది. గుంగువాడ, కళింగపట్నం తీరం వద్ద కొంతమేర కోతకు గురైంది. తీర ప్రాంతంలో రక్షణ కోసం నాటిన వృక్షాలు నేలమట్టమవటంతో తీరంలో రక్షణ లేకుండా పోయిందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గెడ్డూరు, ఎంగంగువాడ వంటి తీరప్రాంతాల్లో ఇసుక తెన్నెలు కోతకు గురవటంతో ఆయా ప్రాంతవాసులు కంటిమీదకునుకు లేకుండా కాలం వెళ్లదీస్తున్నారు. అలాగే కళింగపట్నం, బందరువానిపేట, కొవ్వాడ నుంచి బారువ వరకు తీరప్రాంత మత్స్యకారులు సముద్రంలో చేపల వేటకు వెళ్లలేకపోయారు. సముద్రపు అలలు, ముందుకు రావడంతో ఒడ్డున ఉన్న పడవలు, తెప్పలు, వలలు, ఒడ్డున సురక్షిత ప్రదేశంలో భద్రపరిచారు.

ముసురేసింది

- జిల్లావ్యాప్తంగా కురుస్తున్న వర్షాలు
- పంట నష్టం తప్పదని రైతుల ఆందోళన
- తగ్గిన ఉష్ణోగ్రతలతో వణుకుతున్న ప్రజలు
- తీరంలో ఎగిసి పడుతున్న అలలు..

శ్రీకాకుళం/హరిపురం/గార/ నరసన్నపేట, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో.. జిల్లా అంతటా గురువారం ముసురేసింది. రెండు రోజులుగా అడపాదడపా జల్లులు పడగా.. గురువారం మధ్యాహ్నం ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. గార మండలంలో 14మి.మీ. వర్షపాతం నమోదైంది. పోలాకిలో 7, సరుబుజ్జిలిలో 6.75, కోటబొమ్మాళిలో 5.75, శ్రీకాకుళంలో 5.5, నరసన్నపేటలో 5.5, ఆముదాలవలసలో 5.25, ఎచ్చెర్లలో 4.75, ఎల్.ఎన్.పేట 4.5, లావేరులో 2.25, రణస్థలంలో 2.00, సారవకోటలో 2.00, హిరమండలం, జి.సిగడాం, పొందూరు ప్రాంతాల్లో 1.5 మి.మీ. చొప్పున వర్షపాతం నమోదైంది. శ్రీకాకుళంలో వర్షం కారణంగా నగర ప్రజలు, వ్యాపారులు, విద్యార్థులు, ఉద్యోగులు అవస్థలకు గురయ్యారు. అలాగే రెండు రోజులుగా తుఫాన్ ప్రభావంతో వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడంతో ఒక్కసారిగా ఉష్ణోగ్రతలు తగ్గాయి. గురువారం జిల్లాలో 21 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. చలితో ప్రజలు ఇంటి నుంచి బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. చిరుజల్లులతో పాటు చలిగాలులు వీయడంతో ప్రజలు గజగజ వణికిపోతున్నారు.

తడిచిన పంట..

వర్షం కారణంగా శ్రీకాకుళం రూరల్, గార, పోలాకి, నరసన్నపేట, మందస, పలాస, టెక్కలి, సోంపేట, ఇచ్ఛాపురం, పాతపట్నం, ఆమదాలవలస, రణస్థలం తదితర మండలాల్లో వరికుప్పలు తడిచిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కొన్నిచోట్ల వరిపంట నేలకొరిగింది. కళ్లాల్లో ఉంచిన ధాన్యం భద్రపరిచేందుకు రైతులు అపసోపాలు పడ్డారు. పంట చేతికి అందే సమయంలో తుఫాన్‌ల కారణంగా.. తమకు నష్టం తప్పేలా లేదని వాపోతున్నారు. అలాగే మందస ఏజెన్సీ లో విస్తారంగా నాటిన పత్తిపంటపై వర్షం తీవ్ర ప్రభావం చూపించింది. బుడార్సింగి, చీపి, అంబటికంబారం, చిన్నకోష్ట, గౌడగురంటి తదితర గ్రామాల్లో సుమారు పదివేల ఎకరాల్లో నాటిన పత్తిపంట తడిచిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



కళింగపట్నం వద్ద కోతకు గురైన తీరం



బందరువానిపేట తీరం వద్ద ఎగసిపడుతున్న అలలు



శ్రీకాకుళం రూరల్‌లో నేలకొరిగిన వరిపంట



హరిపురం: గంగువాడ వద్ద కోతకు గురైన తీరం..



శ్రీకాకుళంలో కురుస్తున్న వర్షం

అధికారికంగా రథసప్తమి

- రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల

అరసవల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యప్రదాత.. ప్రత్యక్షదైవం.. అరసవల్లి శ్రీ సూర్యనారాయణస్వామి రథసప్తమి వేడుకలు ఇకపై అధికారికంగా జరగనున్నాయి. 'రథసప్తమి'ని రాష్ట్ర పండుగగా ప్రభుత్వం గుర్తిస్తూ ఉత్తర్వులు విడుదల చేసింది. ఈ మేరకు శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ స్థానిక విశాఖ-ఏ కోలనీలోని తన కార్యాలయం నుంచి గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. 'అరసవల్లిలో ప్రతీ ఏడాది ఫిబ్రవరి లేదా మార్చిలో సూర్యదేవుని పుట్టిన రోజు(రథసప్తమి) వేడుకలను నిర్వహిస్తుంటాం. ఈ వేడుకలకు తెలుగు రాష్ట్రాలతోపాటు, ఒడిశా, ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులకు కూడా పెద్ద సంఖ్యలో వచ్చి, స్వామిని దర్శించుకుంటారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 4న నిర్వహించనున్న రథసప్తమి ఉత్సవాలను మూడు రోజుల రాష్ట్ర పండుగగా గుర్తిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం ఆనందంగా ఉంది. నా కృషి ఫలించింది. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డికి, కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్నాయుడుకి, రాష్ట్రమంత్రి అచ్చెన్నాయుడుకు ప్రత్యేక కృతజ్ఞతలు' అని ఎమ్మెల్యే గొండు శంకర్ తెలిపారు. అలాగే ప్రసాద్ పథకంలో భాగంగా ఆదిత్యాలయ అభివృద్ధికి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం రూ.100కోట్లు మంజూరు చేసిందన్నారు.

తీరప్రాంత పరిరక్షణకు పటిష్ఠ చర్యలు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్



శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): తీరప్రాంత పరిరక్షణకు పటిష్ఠ చర్యలు చేపడతామని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లాస్థాయి తీరప్రాంత భద్రతా కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ గత సమావేశంలో చర్చించిన అంశాలపై తొలుత చర్చించారు. కోస్టల్ పోలింగ్ స్టేషన్స్ గోడల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. సముద్రతీర ప్రాంతాల్లో గస్తీ ఏర్పాటు చేస్తున్నా.. ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇందుకోసం ఆయా ప్రాంతాల్లో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని తెలిపారు. తీర ప్రాంతాల్లో హోర్డింగ్స్ బారువ, కళింగపట్నం ప్రాంతాల్లో లైఫ్ జాకెట్స్, బోట్లు అవసరమని సభ్యులు కోరగా, ఈ దిశగా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను కలెక్టర్ ఆదేశించారు. సముద్రంలో వేటకు వెళ్లే మత్స్యకారులు మత్స్యశాఖ జారీచేసే బయోమెట్రిక్ కార్డులు, ఆధార్ కార్డులు తీసుకువెళ్లడం లేదని, దీనిపై మత్స్యకారులకు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. అలాగే సముద్ర తీరంలో జెట్టీలను ఏర్పాటు చేయాలని సభ్యులు కోరగా.. సంబంధిత పనులపై తక్షణ చర్యలు చేపట్టాలని మత్స్య శాఖ ఏడీని ఆదేశించారు. ఇంటర్‌నెట్ సౌకర్యం కూడా తీరప్రాంత గ్రామాలకు కల్పించాలని తెలిపారు. సమావేశంలో కోస్టల్ గార్డ్ ఎస్పీ రవివర్మ, ప్రోగ్రామ్ మేనేజర్ పి.రాము, మత్స్యశాఖ ఏడీ పీవీ శ్రీనివాసరావు, సహాయ సంచాలకులు సంతోష్‌కుమార్, తీర ప్రాంత సీఐలు, ఎస్ఐలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

నేడు విభిన్న ప్రతిభావంతులకు 'స్వాభిమాన్'

శ్రీకాకుళం కలెక్టరేట్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): విభిన్న ప్రతిభావంతుల సమస్యల పరిష్కారానికిగానూ శుక్రవారం ఉదయం జడ్పీ సమావేశ మందిరంలో 'స్వాభిమాన్' కార్యక్రమం ద్వారా వినతులు స్వీకరించనున్నట్టు ఆ శాఖ సహాయ సంచాలకులు కె.కవిత గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని విభిన్న ప్రతిభావంతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెట్రోల్ బంక్‌లో.. మంటలు

- త్రుటిలో తప్పిన ముప్పు
- షార్ట్‌సర్క్యూటే ప్రమాదానికి కారణమంటున్న బంకు యాజమాన్యం
- ఆ అవకాశమే లేదంటున్న విద్యుత్‌శాఖ అధికారులు
- కానరాని నిబంధనలు



టెక్కలిలోని పెట్రోల్ బంకులో చెలరేగిన మంటలు

టెక్కలి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): టెక్కలిలోని పాత జాతీయ రహదారి ఆదీఆంధ్రా వీధి వెనుక ఉన్న భారత్ పెట్రోలియం బంక్‌లో గురువారం ఉదయం పెద్దఎత్తున మంటలు చెలరేగాయి. స్థానికులు భయాందోళన చెందారు. ఎటువంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఈ ఘటనకు విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణమని బంక్ యాజమాన్యం చెబుతోంది. కాగా.. ఆ అవకాశం లేదని విద్యుత్ శాఖ అధికారులు చెబుతున్నారు. యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ఈ ప్రమాదం జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి.

- బీపీసీఎల్ ఆధ్వర్యంలో గుంటూరు ప్రాంతానికి చెందిన వైసీపీ నాయకుడు కామినేని రవిశంకర్ పేరుతో ఈ బంకు నడుస్తోంది. తాజాగా మహేష్ అనే వ్యక్తి ఈ బంకును తన పేరున బదిలీ కోసం బీపీసీఎల్‌కు దరఖాస్తు చేసుకున్నారు. గురువారం ఉదయం 8.30గంటల సమయంలో ఈ బంకులో ఓ పంపు నుంచి మంటలు చెలరేగాయి. దీంతో అక్కడ సిబ్బంది, పెట్రోల్ కోసం వచ్చే వాహనదారులు ఒక్కఉదుటున పరుగులు పెట్టారు. మంటలు ఆర్పేందుకుగానూ బంక్‌లోని ఫైర్‌సేఫ్టీ సామగ్రి వినియోగించేందుకు సిబ్బంది ప్రయత్నించగా.. అవి కొన్ని పనిచేయలేదు. ఒకటి, రెండు ఫైర్ సామగ్రి కూడా మంటలకు కాలిపోయాయి. హుటాహుటిన అక్కడున్న సిబ్బంది.. టెక్కలి నాలుగురోడ్ల కూడలిలో ఉన్న మరో పెట్రోల్ బంకు వద్దకు వెళ్లి ఫైర్‌సేఫ్టీ సామగ్రి తెచ్చి మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. సమాచారం తెలుసుకున్న అగ్నిమాపక సిబ్బంది కూడా అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. బంకులో అగ్ని ప్రమాదం జరిగే సమయానికి 2,600లీటర్ల పెట్రోల్, ఎనిమిది వేల లీటర్ల డీజల్ ఉందని సిబ్బంది తెలిపారు.
- ప్రస్తుతం ఈ బంకులో అదనంగా చెరో 20కేఎల్ ట్యాంకులు పెంచాలనే యోచనతో బీపీసీఎల్ కాంట్రాక్టర్ ఆధ్వర్యంలో సంబంధిత పైపులైన్ పనులు చేస్తున్నారు. వెల్డింగ్ నిప్పురవ్వలు తుల్లి మంటలు వ్యాపించాయని తెలుస్తోంది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలనే ఈ సంఘటన చోటుచేసుకుందని బంకు నిర్వాహకుడు మహేష్ తెలిపారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న పంపులకు సంబంధించి డిస్కనెక్ట్ చేసే పనులు చేయిస్తున్నామన్నారు.

అధికారుల పరిశీలన..

రెవెన్యూ అధికారులు, పోలీసులు, విద్యుత్‌శాఖ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాద ఘటనపై ఆరా తీశారు. సంఘటనా స్థలాన్ని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి పరిశీలించారు. బీపీసీఎల్ సేల్స్ ఆఫీసర్ అన్విత, కాంట్రాక్టర్ పనులు నిర్వహిస్తున్న సిబ్బంది, బంకు తాత్కాలిక యజమాని మహేష్‌తో మాట్లాడారు. ప్రమాద సంఘటన, ఆయిల్ నిల్వలు అంశాలపై ఆరాతీశారు. సీఐ విజయ్‌కుమార్, సీఎస్‌డీటీ అనిల్‌కుమార్ పాత్రో, అగ్నిమాపకశాఖ అధికారి కూర్మారావుతో చర్చించారు. ఈ ప్రాంతంలోని సీసీ కెమేరాల ఫుటేజ్‌లను పరిశీలించి.. తనకు వివరాలు తెలియజేయాలని తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘించి..

వాస్తవానికి ఈ బంకు విస్తీర్ణం చాలా చిన్నది. ఒకటి, రెండు గ్రానైట్ వాహనాలు, ఇతర లారీలు లోపలకు వెళితే తిరగడానికి అతికష్టమవుతుంది. ఇంత చిన్న ప్రదేశంలో ఇప్పటికే 20కేఎల్, 15కేఎల్ డీజిల్, 20కేఎల్, 15కేఎల్ పెట్రోల్ ట్యాంకులు ఉన్నాయి. టెక్కలిలో చాలాకాలంగా ఈ బంకు నడుస్తోంది. విక్రయాలు బాగుండడంతో ఈ ఇరుకు ప్రదేశంలోనే అదనంగా చెరో 20కేఎల్ పెట్రోల్, డీజిల్ ట్యాంకులు అమర్చేందుకు బీపీసీఎల్ కాంట్రాక్టర్లు పనులు చేపట్టారు. ట్యాంకు పనులు (మిగతా 6వ పేజీలో..)



పెట్రోల్ బంకును పరిశీలిస్తున్న ఆర్డీవో కృష్ణమూర్తి, అధికారులు

వీడని సుపారీ మిస్టరీ!

- టీడీపీ నేత నాగరాజు ఇంటి వద్ద పోలీసుల భద్రత

పలాస, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు బడ్డ నాగరాజు హత్యాయత్నానికి సంబంధించి సుపారీ మిస్టరీ వీడడం లేదు. స్థానిక వైసీపీ నాయకులు బీహార్ రాష్ట్రానికి చెందిన ముఠాకు సుపారీ ఇచ్చి.. ఆయనను హతమార్చేందుకు యత్నించగా.. ఊహించని విధంగా పోలీసులకు చిక్కడంతో పథకం బెడిసికొట్టిన విషయం తెలిసిందే. కాగా.. బీహార్ గ్యాంగ్‌తో పాటు కొంతమంది వైసీపీ నాయకులు పోలీసులకు పట్టుబడి ఐదు రోజులు గడుస్తున్నా ఇంకా వారి వివరాలు వెల్లడించకపోవడంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. ఇంకా వీరి వెనుక ఎవరైనా పెద్దలు ఉన్నారా?, నాగరాజుతో పాటు మరెవరైనా రాజకీయ నాయకులు వారి టార్గెట్ లో ఉన్నారా? అన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వాస్తవానికి నాగరాజును సుపారీ ఇచ్చి హతమార్చేంత పెద్ద వ్యక్తి ఏమీ కాదు. వైసీపీ హయాంలో ఐదేళ్లపాటు ఆ పార్టీ నాయకుల వేధింపులకు గురైన వ్యక్తి. ఆయనను మొత్తం పది కేసుల్లో ఇరికించారు. దీంతో పాటు ఎస్సీఎస్టీ అట్రాసిటీ కేసు కూడా చివరిలో నమోదు చేయించి రౌడీషీట్ తెరిచేందుకు పక్కా ప్లాన్ వేసుకున్నారు. అయితే ఇంతలో సార్వత్రిక ఎన్నికల్లో వైసీపీ ఘోర పరాజయం పొందడంతో వారి ప్రయత్నం బెడిసికొట్టింది. నాగరాజును అరెస్టు చేయించలేకపోయారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ పాలనలో నాగరాజుకు ప్రాధాన్యం పెరగడంతో.. స్థానిక వైసీపీ నేతలు జీర్ణించుకోలేకపోతున్నారనే ఆరోపణలున్నాయి.



చిన్నబడాంలో పోలీసు పహారా

- కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత.. తనకు బెదిరింపు కాల్స్ ఎక్కువయ్యాయని నాగరాజు తన అనుచరులు వద్ద చెప్పేవారు. విజయదశమిరోజున ఆయనకు ప్రాణహాని తలపెట్టేందుకు బయట గ్రామాల నుంచి రౌడీలను తెచ్చినట్లు సమాచారం. దీనిపై నాగరాజు, ఆయన అనుచరులు పోలీసులకు సూచనప్రాయంగా సమాచారం ఇచ్చారు. గ్రామాల్లో అటువంటి అపరిచిత వ్యక్తుల కోసం గాలింపు చేపట్టారు. అలజడులు చేస్తే అందుకు తగిన విధంగా ప్రతిఘటనకు కూడా సిద్ధమయ్యారు. అయితే బీహార్ నుంచి ఏకంగా సుపారీ గ్యాంగ్‌ను రప్పించి హతమార్చేందుకు నాగరాజును ప్రయత్నించారనే పోలీసుల నుంచి సమాచారం రావడంతో ఆయన స్వగ్రామం చిన్నబడాంలో ఒక్కసారిగా అలజడి రేగింది.
- 30 ఏళ్ల కిందట చిన్నబడాంలో కోత రామారావు అనే జాతీయ కబడ్డి క్రీడాకారుడ్ని దారి కాచి రోడ్డుపైనే దారుణంగా హతమార్చారు. అప్పట్లో ఆ హత్య సంచలనం రేపింది. ఆయన సామాజిక వర్గానికి చెందిన బడ్డ నాగరాజును కూడా అదేరీతిలో హతమార్చేందుకు యత్నించగా.. పథకం బెడిసికొట్టింది. ఆ కేసునకు సంబంధించి శిక్షలు అనుభవించిన వ్యక్తుల్లో కొంతమంది నాగరాజుపై ప్లాన్ వేశారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం చిన్నబడాంలో నిశ్శబ్దం చోటుచేసుకుంది. నాగరాజుకు హతమార్చేందుకు ప్రయత్నిస్తుండడంతో పోలీసు నిఘా పెంచారు. ఆయన ఇంటి వద్ద పహారా పెట్టారు. ఆ ప్రాంతంలో కొత్త వ్యక్తులు ఎవరు వచ్చినా పోలీసులు ప్రశ్నిస్తున్నారు.

పంచాయతీ.. 'నగర'మయ్యేదెపుడో!

8లో

- మూడుచోట్ల గ్రేడ్ పెంపునకు గతంలో ప్రణాళిక
- తాజాగా కూటమి ప్రభుత్వం కసరత్తు





నరసన్నపేటలో హరిదాసు సందడి

సంప్రదాయ శోభ!

- ఇటు హరిదాసుల సంకీర్తనలు.. అటు మేలుకొలుపులు
- వాకిళ్లలో ముత్యాల ముగ్గులు, గొబ్బెమ్మలు
- గ్రామాల్లో ధనుర్మాస సందడి

తెలుగు నాట సంస్కృతి, సనాతన సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలకు ప్రతీకగా నిలిచే సంక్రాంతికి పల్లెల్లో సందడి నెలకొంది. గ్రామాలు ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతున్నాయి. ఒకవైపు వేకువజామునే హరి నామసంకీర్తనలతో మేలుకొలుపులు, మరోవైపు హరిదాసుల సంకీర్తనలతో పల్లెలు పులకిస్తున్నాయి. వాకిళ్లు ముత్యాల ముగ్గులు, గొబ్బెమ్మలతో అలరాలుతున్నాయి. గంటల సాయిబుల దీవింపులు, గంగిరెద్దుల ఆటలు, చెంచుల విన్యాసాలతో సందడిగా నెలకొంది. సంక్రాంతి నేపథ్యంలో నరసన్నపేట పట్టణం హరిదాసుల నామ సంకీర్తనలతో మార్మోగుతోంది. వైష్ణవ దేవాలయాల్లో పూజలూ జరుగుతున్నాయి. గోదారంగనాథస్వాములను రోజుకొక పాశురంలో కొలుస్తున్నారు.

-నరసన్నపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి)



నరసన్నపేటలో మేలుకొలుపు భజనలు



హిరమండలంలో కురుస్తున్న వర్షం



పలాస రూరల్ : పారసాంబ వద్ద పొలాల్లో వరికుప్పలు..

అన్నదాతకు వీడని గుబులు

- చిరుజల్లులతో ఆందోళన
- పంట కాపాడుకొనేందుకు పాట్లు
- ధాన్యం తరలింపులో బిజీబిజీ

పలాసరూరల్/మెళియాపుట్టి/ఎల్.ఎన్.పేట/వజ్రపుకొత్తూరు/టెక్కలి/నందిగాం/జలుమూరు/హిరమండలం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి)

బంగాళాఖాతంలో అల్పపీడన ప్రభావంతో చిరుజల్లులు కురుస్తుండటంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. వరి కోత, నూర్పుల సమయంలో చిరుజల్లులు కురుస్తుండటంతో తల్లడిల్లుతున్నారు. పొలాల్లో చేనుతో పాటు వరి కుప్పలు, నూర్పుల వేసిన ధాన్యం తడిచి ముద్దయ్యాయి. పంటను సంరక్షించేందుకు రైతులు కష్టాలు పడుతున్నారు. పలాస మండలంలో గురువారం ఉదయం నుంచి మళ్లీ చిరుజల్లులు ప్రారంభం కావడంతో రైతులు తలలు పట్టుకున్నారు. కేశపురం, నారాయణపురం, బ్రాహ్మణతర్లా, సున్నాడ, కైజోల, తర్లాకోట, రెంటికోట, అల్లుకోల, నవర గోవిందపురం, రామకృష్ణాపురం ప్రాంతాల్లో రైతులు వారి పంటను రక్షించేందుకు విశ్వప్రయత్నం చేశారు. జగన్నాథపురంలో వరి కుప్పలను తహశీల్దార్ కళ్యాణచక్రవర్తి వీఆర్వో ఖగేశ్వరరావు పరిశీలించారు. మెళియాపుట్టిలో వర్షాలు, గాలులకు రైతులు ఆందోళన చెందుతున్నారు. నూర్పులు చేసి కళ్లాల్లో నిల్వ ఉంచిన ధాన్యాన్ని సంరక్షించుకునేందుకు ఆపసోపాలు పడుతున్నారు. ఎల్.ఎన్.పేట మండలంలో చిరుజల్లులకు తోడు తేలికపాటి గాలులు వీసాయి. పొలాల్లో చేను కుప్పలపై టార్పాలిన్లు కప్పి, పంటను కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. వజ్రపుకొత్తూరు మండలంలోని బెండి, పెద్దబొడ్డపాడు, సీతాపురాల్లోని పంటపొలాలను గురువారం వ్యవసాయశాఖ ఏడీ మధు, ఏవో కిరణవాణి పరిశీలించారు. టెక్కలి మండలంలో గురువారం చిరుజల్లులు కురవడంతో రైతులు ఇబ్బందులు పడ్డారు. ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు ఆపసోపాలు పడ్డారు. ఇంటిల్లపాది వరి కుప్పలు వద్దే పడిగాపులు కాశారు. నందిగాం మండలంలోని రైతులు పంటను కాపాడుకునేందుకు వ్యయప్రయాసలకు గురవుతున్నారు. ప్రభుత్వం టార్పాలిన్లు సరఫరా చేస్తుండటంతో వాటి కోసం రెవెన్యూ కార్యాలయానికి రైతులు ఎగబడ్డారు. జలుమూరు మండలంలోని రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని సంరక్షించుకోడానికి రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. అల్పపీడన ప్రభావం హిరమండలంలోని రైతన్నలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. గురువారం రాత్రి మోస్తారు వర్షం కురవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆరబోసిన ధాన్యాన్ని భద్రపరిచేందుకు నానా అవస్థలు పడుతున్నారు.



టెక్కలి: ధాన్యం బస్తాలపై పరదాలు కప్పిన దృశ్యం



ఎల్ఎన్‌పేట: పొలాల్లో వర్షపునీరు



మెళియాపుట్టి: పొలాల నుంచి ధాన్యం తరలిస్తున్న రైతులు



వజ్రపుకొత్తూరు: బెండిలో రైతులతో మాట్లాడుతున్న ఏడీ

పల్లెపండుగ పనులకు ప్రాధాన్యం

- పంచాయతీరాజ్ ఈఈ ఎ.సూర్యప్రకాశ్

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



టెక్కలి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి)

టెక్కలి పంచాయతీరాజ్ డివిజన్ పరిధిలో పల్లెపండుగ పనులకు ప్రాధాన్యమిస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎ.సూర్యప్రకాశ్ తెలిపారు. డివిజన్ పరిధిలోని ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం నియోజకవర్గాలకు సంబంధించి 2,298 పల్లెపండుగ పనులు జరుగుతున్నాయని, వాటిని పర్యవేక్షిస్తున్నామన్నారు. పనుల పురోగతి, నిధులు వెచ్చింపు తదితర అంశాలపై ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ముఖాముఖి అయ్యారు.

- **ప్రశ్న:** డివిజన్‌లో పల్లెపండుగ పనులు ఎలా సాగుతున్నాయి?
- **జవాబు:** టెక్కలి పంచాయతీరాజ్ డివిజన్ పరిధిలో పల్లెపండుగ కింద ఉపాధి హామీ నిధులతో ప్రారంభించిన 2,298 పనులకు గాను ఇప్పటికే 530 పనులు పూర్తయ్యాయి. ఇచ్ఛాపురం నియోజకవర్గానికి రూ.30.93 కోట్లతో 634 పనులు, పలాసలో రూ.34.12 కోట్లతో 423 పనులు, టెక్కలిలో రూ.68.24 కోట్లతో 846 పనులు, పాతపట్నంలో రూ.22.25 కోట్లతో 395 పనులు చేపట్టేందుకు నిర్ణయించాం. ఇప్పటికే ఇచ్ఛాపురం నియోజకవర్గంలో 253 పనులు, పలాసలో 85, టెక్కలిలో 125, పాతపట్నంలో 67 పనులు పూర్తయ్యాయి. పనుల్లో సీసీ రోడ్లకు ప్రాధాన్యమిచ్చాం.
- **ప్ర:** టూరిజం పనులు ఏయే మండలాల్లో చేపడుతున్నారు?
- **జ:** సంతబొమ్మాళి, వజ్రపుకొత్తూరు, మందస, సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం ప్రాంతాల్లో టూరిజం నిధులతో వివిధ పనులు జరుగుతున్నాయి.
- **ప్ర:** రైతు సేవాకేంద్రాల నిర్మాణంలో జాప్యానికి కారణమేమిటి?
- **జ:** టెక్కలి పీఆర్ డివిజన్ పరిధిలో 334 రైతు సేవాకేంద్రాలకు గానూ 157 రైతు సేవా కేంద్రాలు ఇప్పటికే పూర్తయ్యాయి. 11 చోట్ల పనులు ప్రారంభించలేదు. 156 రైతు సేవా కేంద్రాల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. వీటికి సంబంధించి రూ.38.50 కోట్లు నిధులు అవసరముంది.
- **ప్ర:** అసంపూర్తిగా ఉన్న సచివాలయాల నిర్మాణాలు ఎప్పటిలోగా పూర్తిచేస్తారు?
- **జ:** డివిజన్‌లో 335 సచివాలయాలకు గానూ 172 సచివాలయాల నిర్మాణాలు పూర్తయ్యాయి. మరో 130 వరకు సచివాలయాల నిర్మాణాలు సగం పూర్తయ్యాయి. 11 చోట్ల పనులు ప్రారంభం కాలేదు. సచివాలయాల నిర్మాణాలు పూర్తిచేయాలంటే రూ.47 కోట్లు అవసరమని గుర్తించాం.
- **ప్ర:** విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణాలు జరుగుతున్నాయా?
- **జ:** డివిజన్‌లో 272 విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు గానూ 96 పూర్తిచేశాం. 8 చోట్ల పనులు ప్రారంభానికి నోచుకోలేదు. 168 విలేజ్ హెల్త్ క్లినిక్‌లు వివిధ దశల్లో నిర్మాణంలో ఉన్నాయి. ఇప్పటికే రూ.28 కోట్లు వెచ్చించాం. ఇవి పూర్తికావాలంటే మరో రూ.23 కోట్లు అవసరముంది.
- **ప్ర:** ఎంపీ లాడ్స్ పనులు జరుగుతున్నాయా?
- **జ:** డివిజన్‌లో 124 పనులకు గానూ రూ.6.30 కోట్లు మంజూరు కాగా, రూ.4.50 కోట్లతో ఇప్పటికే పలుచోట్ల పనులు పూర్తిచేశాం. 2023-24 సంవత్సరానికి సంబంధించి రూ.4.33 కోట్లతో 91 పనులు ఒక్క ఇచ్ఛాపురం నియోజకవర్గానికి మంజూరయ్యాయి. అందులో 80 పనులు పూర్తిచేశాం. రెండుచోట్ల పనులు ప్రారంభించకపోగా, మూడుచోట్ల పనులు నిలుపుదల చేశాం. పలాస నియోజకవర్గ పరిధిలో 19 ఎంపీ లాడ్స్ పనులకు నాలుగు చోట్ల పూర్తికాగా రెండు ప్రారంభానికి నోచుకోకపోగా, మిగిలిన పనులు బిల్స్ స్టేజ్‌లో ఉన్నాయి. పాతపట్నం నియోజకవర్గం పరిధిలో ఐదు పనులకు మూడు పూర్తికాగా, రెండు పురోగతిలో ఉన్నాయి. టెక్కలిలో తొమ్మిది పనులకు గానూ నాలుగు పూర్తికాగా, మూడు పురోగతిలో ఉన్నాయి. ఒకటి రద్దు చేయగా, మరో రెండు ప్రారంభానికి నోచుకోలేదు.
- **ప్ర:** పంచాయతీరాజ్ కార్యాలయాల్లో సిబ్బంది కొరత ఉందా?
- **జ:** పంచాయతీరాజ్ కార్యాలయాలకు సంబంధించి టెక్కలి పీఆర్ కార్యాలయంలో ఒక డీఈ పోస్టు, రెండు జేఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అలాగే ఇచ్ఛాపురం నియోజకవర్గంలో రెండు, పలాస నియోజకవర్గంలో రెండు, పాతపట్నంలో ఎల్ఎన్‌పేట, టెక్కలి నియోజకవర్గంలో సంతబొమ్మాళి, నందిగాం మండలాల్లో జేఈ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.



ప్రత్యేక అలకంరణలో మహాలక్ష్మీదేవి

మహాలక్ష్మీ నమోస్తుతే!

ఇచ్ఛాపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలోని మహావిష్ణువు, జగన్నాథస్వామి దేవస్థానంలో మార్గశిర గురువారం పర్వదినం సందర్భంగా మహాలక్ష్మీ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. పంచామృతాలు, గంగాజలంతో అభిషేకించారు. నూతన వస్త్రాలు, ఆభరణాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం సహస్రనామ, కుంకుమార్చన, పుష్పార్చన చేశారు. కార్యక్రమాలను ఆలయ మేనేజర్ బెండి రామారావు పర్యవేక్షించారు.

కొనసాగుతున్న స్పోర్ట్స్ మీట్



పరుగు పందెంలో క్రీడాకారులు

ఎచ్చెర్ల, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (శ్రీకాకుళం) ఆవరణలో మూడు రోజుల పాటు నిర్వహిస్తున్న రీజనల్ స్పోర్ట్స్ మీట్ రెండో రోజైన గురువారం ఉత్సాహంగా కొనసాగింది. ఈ పోటీల్లో క్రీడాకారులు హోరాహోరీగా తలపడుతున్నారు. ఉదయం పూట ఎలాంటి అంతరాయం లేకుండా ఈ పోటీలు జరగగా, రెండో పూట చిరుజల్లులు కారణంగా క్రీడాకారులు ఇబ్బంది పడ్డారు. ఉమ్మడి జిల్లా పరిధిలోని 10 పాలిటెక్నిక్ కళాశాలల క్రీడాకారులు పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ బి.జానకిరామయ్య పర్యవేక్షణలో ఈ పోటీలు కొనసాగతుండగా.. శుక్రవారంతో ముగియనున్నాయి.

రెండో రోజు ఫలితాల వివరాలు..

బాల్ బ్యాడ్మింటన్‌లో ఆదిత్య పాలిటెక్నిక్ కళాశాల విన్నర్‌గా, వెంకటేశ్వర పాలిటెక్నిక్ రన్నర్‌గా నిలిచాయి. చెస్ బాలుర విభాగంలో కె.ప్రదీప్ (ఆమదాలవలస పాలిటెక్నిక్) విన్నర్, కె.హరి (ప్రభుత్వ పాలిటెక్నిక్, శ్రీకాకుళం) రన్నర్‌గా, చెస్ బాలికల విభాగంలో బి.రమ్యశ్రీ వైష్ణవి (ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్, శ్రీకాకుళం) విన్నర్‌గా, బి.హారిక (జీపీటీ, శ్రీకాకుళం) రన్నర్‌గా నిలిచారు. టేబుల్ టెన్నిస్, బ్యాడ్మింటన్ విభాగాల్లో పోటీలు జరిగాయి.



షాట్‌పుట్ విసురుతున్న క్రీడాకారిణి

సమన్వయంతో పనిచేస్తేనే సత్ఫలితాలు

- ముగిసిన పోలీసు క్రీడా పోటీలు

ఎచ్చెర్ల, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): క్రీడల్లోనైనా, విధుల నిర్వహణలోనైనా సమన్వయంతో పనిచేస్తేనే సత్ఫలితాలు సాధించగలమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. ఎచ్చెర్ల సాయుధ పోలీసు మైదానంలో మూడు రోజులుగా జరుగుతున్న జిల్లా పోలీసు క్రీడా పోటీల ముగింపు కార్యక్రమం గురువారం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన కలెక్టర్ మాట్లాడుతూ.. క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందన్నారు. ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. ప్రతి రోజూ వ్యాయామానికి కొంత సమయాన్ని కేటాయించాలన్నారు. మానసిక ఒత్తిడిని తగ్గించేందుకు క్రీడలు దోహదపడాలన్నారు. కార్యక్రమంలో జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, ఏఎస్పీ కేవీ రమణ, డీఎస్పీలు వివేకానంద, శేషాద్రి, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. కాగా ఈ పోటీల్లో ఓవరలాల్ ఛాంపియన్‌గా సాయుధ పోలీసు జట్టు సాధించింది. వాలీబాల్, కబడ్డీ, బాస్కెట్ బాల్ విభాగాల్లో సాయుధ దళం ప్రథమ స్థానాన్ని, క్రికెట్ విజేతగా కాశీబుగ్గ సబ్‌డివిజన్, తగ్ ఆఫ్ వార్ హోంగార్డుల విభాగం కైవసం చేసుకుంది. విజేతలకు మెమొంటోలు, ప్రశంసా పత్రాలు కలెక్టర్, ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు.



కలెక్టర్, ఎస్పీలతో ఓవరాల్ చాంపియన్ సాధించిన సాయుధ విభాగం జట్టు

పెట్రోల్ బంక్‌లో.. మంటలు

(ఐదో పేజీ తరువాయి)

జరిగేటప్పుడు పెట్రోల్ బంకులు మూసివేసి ట్యాంకులను అమర్చాలి. కానీ ఇక్కడ బంక్ మూయకుండా పెట్రోల్, డీజిల్ విక్రయిస్తూనే.. మరోవైపు కొత్త ట్యాంకుల నిర్మాణాలు చేపడుతున్నారు. అలాగే ఫైర్‌సేఫ్టీ ఎన్‌వోసీ లేకుండా ప్రొవిజినల్స్‌తోనే కాలం గడుపుతున్నారు. ఈనెల 30తో దాని కాలపరిమితి కూడా ముగియనుందని ఫైర్ అధికారి తెలిపారు. ఈ పెట్రోల్ బంకు సమీపంలో ఇంజన్‌ఆయిల్ దుకాణాలు, వెనుక ఎస్సీ కాలనీ, దగ్గర్లో సినిమాహాల్, కళ్యాణ మండపం, పలురకాల ద్విచక్రవాహనాల దుకాణాలు, ఇతర షాపులు ఉన్నాయి. వీటికి తోడు ఈ బంకు ప్రాంగణంలో మూడు నుంచి ఐదువేల లీటర్ల ఆయిల్ డోర్‌డెలివరీ తరహాలో బీపీసీఎల్ పేరుతో మినీ ట్యాంకరు ఒకటి ఉంది. తెలంగాణా రిజిస్ట్రేషన్‌తో నడుస్తున్న ఈ మినీట్యాంకర్ నిర్వహణకు బీపీసీఎల్ అనుమతి ఉందా, లేదా అనేది తెలియాల్సి ఉంది. అలాగే నెంబరు లేని పాత ట్యాంకు వాహనంతో కూడా డీజిల్ విక్రయాలు చేయడంలో ఈ బంకు యాజమాన్యం ముందువరుసలో ఉందనే ఆరోపణలు ఉన్నాయి. బంకులో మంటలు వ్యాపించగా.. యాజమాన్యం అక్కడున్న ట్యాంకర్లను అధికారులు రాకముందే ఇతర ప్రాంతాలకు తరలించడం విశేషం.

● తడబాటు ఎందుకో?

బంకులో మంటలు చెలరేగాయనే సమాచారం ఎలా వచ్చిందని అగ్నిమాపకశాఖ అధికారి కూర్మారావు వద్ద ప్రస్తావించగా ల్యాండ్‌లైన్ ఫోన్ ద్వారా తెలుసుకున్నానన్నారు. కాగా.. ల్యాండ్‌లైన్ ఫోన్ చాలా రోజుల నుంచి పనిచేయడం లేదు కదా? అని ప్రశ్నించగా.. ఆయన తడబడ్డారు. చివరకు లోకేశ్ అనే వ్యక్తి నుంచి సమాచారం అందిందని తెలిపారు. అక్కడ ఫైర్‌సేఫ్టీ సామగ్రి ఉందా? అని అడగ్గా.. ఉందన్నారు. పక్క బంకు నుంచి కూడా కొంత సామగ్రి తెచ్చి మంటలు అదుపు చేశామన్నారు. ఫైర్‌సేఫ్టీ మెజర్స్ పనిచేయకపోవడాన్ని గుర్తించామని తెలిపారు.

● తొంగిచూడని బీపీసీఎల్ అధికారులు..

వాస్తవానికి నెలలో రెండుసార్లయినా సంబంధిత పెట్రోల్ బంకులను బీపీసీఎల్ అధికారులు పరిశీలించాలి. సేల్స్‌మేనేజర్‌గా ఉన్న అన్విత ఇవేవీ పట్టించుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. బంకుల్లో ఓవైపు పెట్రోల్, డీజల్ అమ్మకాలు జరుగుతుండగా, మరోవైపు ట్యాంకులు, పైపులైన్ల నిర్మాణ పనులకు ఎలా అంగీకరించారో బీపీసీఎల్ అధికారులకే తెలియాల్సి ఉంది. బంకుల్లో ఏమి జరుగుతుందో గుర్తించేందుకు డీఎస్‌వో, ఇతర రెవెన్యూ ఉన్నతాధికారులు, తూనికలు, కొలతల శాఖ అధికారులు పర్యవేక్షణ చేయాల్సి ఉన్నా.. ఆ పరిస్థితి లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

షార్ట్‌సర్క్యూట్ కానేకాదు..

పెట్రోల్ బంకులో షార్ట్‌సర్క్యూట్ వలన ప్రమాదం జరిగిందని యాజమాన్యం చెప్పడం వాస్తవం కాదు. మీటరు దగ్గర కానీ, ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర కానీ ఆ పరిస్థితి కనిపించడం లేదు. కనీసం ఫీజులు కూడా కొట్టలేదు. విద్యుత్ శాఖ నుంచి తప్పు జరగలేదు.

- కృష్ణమూర్తి, ఈపీడీసీఎల్ ఏడీ

నేడు నగరంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

గుజరాతీపేట, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): నగరంలోని గుజరాతీపేట 11 కేవీ ఫీడర్ పరిధిలో మరమ్మతుల చేపట్టనుండడంతో ఈ నెల 20వ తేదీ ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ ఈఈ పి.యోగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అందువల్ల గుజరాతీపేట, పీఎన్ కాలనీ, హయాతీనగరం తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, ఈ అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

● ఎచ్చెర్ల, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల 33/11 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో లైన్లకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపు, ఇతర మరమ్మతుల కోసం శుక్రవారం సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పి.యోగేశ్వరరావు తెలిపారు. 11 కేవీ ఫరీద్‌పేట ఫీడర్ పరిధిలోని ఫరీద్‌పేట, ఎస్ఎం పురం, కేశవరావుపేట, లింగాలపేట గ్రామాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్టు చెప్పారు. వినియోగదారులు సహకరించాలన్నారు.

నేడు సీఎంఆర్ షాపింగ్ మాల్ ప్రారంభం

గుజరాతీపేట, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక జీటీ రోడ్డులో కొత్తగా నిర్మించిన సీఎంఆర్ షాపింగ్ మాల్, జ్యూయలర్స్‌ను సినీ హీరోయిన్ శ్రీలీల ఈ నెల 20వ తేదీ శుక్రవారం మధ్యాహ్నం ప్రారంభించనున్నట్టు యాజమాన్య ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణ, ఒడిశా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అతిపెద్ద వస్త్ర వ్యాపార సంస్థగా పేరొందిన ఈ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవంలో కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్‌నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యేలు గొండు శంకర్, కూన రవికుమార్ పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు.

జిల్లాస్థాయి వ్యాసరచన పోటీలు

గుజరాతీపేట, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో డిజిటల్ సౌలభ్యం, వర్చువల్ విచారణల అంశంపై జిల్లాస్థాయి వ్యాసరచన వక్తృత్వ పోటీలను గురువారం నిర్వహించారు. జాతీయ వినియోగదారుల వారోత్సవాల్లో భాగంగా ఈ పోటీలకు జిల్లాలోని ఆరు డిగ్రీ కళాశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో మూడు స్థానాలను ఎంపిక చేశామని, ఈ బహుమతులు జిల్లాస్థాయిలో నిర్వహించే వినియోగదారుల ఉత్సవంలో అందజేస్తారని కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు తెలిపారు. ఈ పోటీలు పారదర్శకంగా నిర్వహించామని, ఇందులో విజేతలకు నగదు ప్రోత్సాహకాలు ఉంటాయని తెలియజేశారు.

క్రికెట్ పోటీలకు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

శ్రీకాకుళం స్పోర్ట్స్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): క్రికెట్‌లో దివ్యాంగులను ప్రోత్సహించేందుకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ నిర్వహిస్తున్నట్టు విభిన్న ప్రతిభావంతుల క్రికెట్ విభాగం జిల్లా కన్వీనర్ కొట్టిన కిరణ్, జీపీ నాయుడు గురువాకంఒ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ అనుబంధంగా నడుస్తున్న నూతన దివ్యాంగుల క్రికెట్ క్రీడాకారులు ఈ నెల 20వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్న వారందరికీ ఎంపికల ప్ర క్రియను ప్రకటిస్తామన్నారు. ఇతర వివరాలకు 86881 46164, 7780167625 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రపంచ తెలుగు మహా సభకులకు ఆహ్వానం

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): విజయవాడలో ఈ నెల 28 నుంచి రెండు రోజుల పాటు జరిగే ఆరో ప్రపంచ తెలుగు రచయితల మహాసభలకి శ్రీకాకుళానికి చెందిన జంధ్యాల శరత్‌బాబుతో పాటు రచయితలు కేవీ రాజారావు, ఉమాకవి, ఈవేమన, భమిడిపాటి గౌరీ శంకర్, ముట్నూరు ఉపేంద్ర శర్మ, పి.దుర్గా ప్రసాద్ తదితరులకు ఆహ్వానం అందింది. తొలిరోజు రామోజీరావు సభావేదిక మీద పత్రికలు, ప్రచురణలు, ప్రసార రంగాల సదస్సు నిర్వహిస్తారు. అందులో ప్రసంగించేందుకు ఆహ్వాన పత్రాన్ని నిర్వాహక సంఘం అధ్యక్ష కార్యదర్శులు జి.సుబ్బారావు, జీవీ పూర్ణచంద్ పంపించినందుకు సిక్కోలు కవులు కృతజ్ఞతలు తెలిపారు.

అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు సరికాదు



అరసవల్లి: ప్రజా సంఘాల నాయకుల నిరసన

అరసవల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను తక్షణమే బర్తరఫ్ చేయాలని ప్రజా సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. పార్లమెంట్‌లో అంబేడ్కర్‌ను అవమానిస్తూ అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ప్రజా సంఘాల నాయకులు గురువారం నిరసన తెలిపారు. తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జి.సింహాచలం, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, రైతు సంఘం కార్యదర్శి కె.మోహనరావు, జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్, ఉపాధ్యక్షుడు కె.అప్పారావు, ఐద్వా జిల్లా కన్వీనర్ అల్లాడ లక్ష్మి, శ్రామిక మహిళా జిల్లా కన్వీనర్ కె.నాగమణి తదితరులు పాల్గొన్నారు. అలాగే కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వ్యాఖ్యలను నిరసిస్తూ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంబటి కృష్ణారావు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు స్థానిక పీఎస్ఎన్ఎం మిల్లు జంక్షన్‌లో నిరసన తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రెల్ల సురేష్, కేవీఎల్ఎస్ ఈశ్వరి, అంబటి దాలినాయుడు, కొత్తపల్లి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

● ఆమదాలవలస, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మునగవలస గ్రామంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు గురువారం నిరసన తెలిపారు. తక్షణమే అమిత్ షాను మంత్రి పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి బొత్స వెంకటరమణ, నాయకులు గొల్లపల్లి దాలయ్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● టెక్కలి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర మంత్రి అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద దళిత సంఘాల నాయకులు నిరసన తెలిపారు. దళిత సంఘాల జేఏసీ నాయకులు బోకర నారాయణరావు, చల్లా రామారావు, కురమాన దాలయ్య, తాతారావు తదితరులు పాల్గొన్నారు.

● కొత్తూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలను నిరసిస్తూ మండల కేంద్రం కొత్తూరులో వ్యవసాయ కార్మిక సంఘం, దళిత ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శిర్ల ప్రసాద్, బి.నగేష్, కె.మిన్నారావు, పి.కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

● జలుమూరు, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో అనుచిత వ్యాఖలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా తీరును నిరిసిస్తూ గురువారం లింగాలవలస కాలనీలో గల అంబేడ్కర్ విగ్రహం వద్ద కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు నిరసన తెలిపారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మామిడి సత్యనారాయణ, నాయకులు భేరి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.


అధికారులతో సమీక్షిస్తున్న ప్రభుత్వ విప్ బెందాళం అశోక్

అభివృద్ధిని అడ్డుకుంటే సహించేది లేదు

● ప్రభుత్వ విప్ అశోక్

కవిటి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి కార్యక్రమాలను అడ్డుకుంటే అధికారులైనా సహించేది లేదని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బెందాళం అశోక్ హెచ్చరించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో గురువారం మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పథకంపై జరిగిన సమీక్షలో ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకం కింద గ్రామాల్లో రోడ్లు నిర్మాణం చేపట్టడం జరుగుతుందన్నారు. గ్రామాల నుంచి బీచ్‌వరకు రోడ్లు నిర్మాణం చేస్తుంటే ఫారెస్ట్ అధికారులు అడ్డుకోవడం తగదన్నారు. సమావేశానికి వచ్చిన ఫారెస్ట్ సెక్షన్ అధికారి రాఘవయ్యను ఈ సందర్భంగా ఎమ్మెల్యే ప్రశ్నించారు. అభ్యంతరాలు ఉంటే కలెక్టర్‌తో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానే తప్పా గ్రామాల్లో పనులు అడ్డుకోవడం తగదన్నారు. అలాగే వ్యవసాయ శాఖపై జరిగిన సమీక్షలో వాతావరణ పరిస్థితులపై రైతులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు. మండల ప్రత్యేకాధికారి అప్పలస్వామి, తహసీల్దార్ మురళీమోహన్‌రావు, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి పనులకు నిధులు

ఆమదాలవలస, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ పరిధిలోని సాగునీటి కాలువ మర మ్మతులకు నిధులు మంజూరు చేసినట్టు టీడీపీ కార్యాలయం గురువాకం ఒక ప్రకటనలో తెలిపా రు. నియోజకవర్గ పరిధిలోని సాగునీటి కాలువల్లో గుర్రపుడెక్క, మురుగు కాలువల్లో తూడికాడ తొలగింపు కోసం మొత్తం 20 పనులకు రూ.17.93 లక్షలు, నియోజకవర్గ పరధిలో ఇరిగేషన్ అత్యవ సర పనులు మరమ్మతుల్లో భాగంగా 17 పనులకు రూ.58.40 నిధులు ప్రభుత్వం మంజూరు చేసినట్టు పేర్కొన్నారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి


చెత్త సంపద కేంద్రాలను పరిశీలిస్తున్న దృశ్యం

ఆమదాలవలస, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామాలను స్వచ్ఛ గ్రామాలుగా తయారు చేసేందుకు కృషి చేస్తున్నట్టు జిల్లా పంచాయతీ అధికారి కె.భారతి సౌజన్య అన్నారు. గురువారం మండలంలోని దూసి, కలివరం గ్రామాల్లోని చెత్త సంపద కేంద్రాలను ఆమె పరిశీలించారు. సేకరించిన చెత్తను నుంచి సంపద కేంద్రాలకు తరలించి వర్మీకంపోస్టును తయారు చేసి పంచాయతీకి ఆదాయం సమకూర్చుకోవాలని సూచించారు. అనంతరం దూసి, కొర్లకోట గ్రామ సచివాలయాలను సందర్శించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ అన్నెపు గోపాలరావు, పంచాయతీ కార్యదర్శులు నాగరాజు, ప్రసన్న, శ్రీనివాస్‌సాగర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత కలిగి ఉండాలి

బూర్జ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మనిషి జీవనమనుగడకు ఆధ్యాత్మికత అవసరమని వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు అన్నారు. గురువారం మండలంలోని ఓవీపేట గ్రామంలో మేలుకొలుపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సూర్యారావు మాట్లాడుతూ.. దైవచింతన లేని మనిషి జీవితం నిర్థదాయకమన్నారు. ఆధ్యాత్మికత అలవర్చుకుంటే మనస్సుకు ప్రశాంతత లభిస్తుందన్నారు.

విశాఖలో జిల్లా విద్యార్థిని ఆత్మహత్య


శిరీష (ఫైల్)

ఎంవీపీ కాలనీ (విశాఖపట్నం), డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఎంటెక్ రెండో సంవత్సరం చదువుతున్న విద్యార్థిని ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. నగరంలోని ఎంవీపీ ఐదో సెక్టార్‌లో గురువారం జరిగిన ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా గొటివాడ గ్రామానికి చెందిన సోమినేని శిరీష (23) ఏడాదిన్నరగా ఎంవీపీలోని తన అక్క, బావ కింజరాపు అశోక్‌కుమార్ ఇంట్లోనే ఉంటూ నగరంలోని ఓ కళాశాలలో చదువుకుంటోంది. ఆరు నెలల కిందట ఈమెకు తన బంధువుతోనే వివాహం జరిగింది. భర్త శ్రీకాకుళంలో ఉంటాడు. చదువు పూర్తిచేయడం కోసం శిరీష విశాఖలో ఉంటోంది. ఈమె తండ్రి అనారోగ్యంతో నెల రోజుల కిందటే మృతిచెందారు. కాగా గురువారం శ్రీకాకుళంలో జరిగే శుభ కార్యక్రమానికి శిరీష అక్క, బావ సోమవారం వెళ్లారు. తాను ఆరోజు వస్తానని చెప్పిన శిరీష ఇక్కడే ఉండిపోయింది. తనకు భయం లేదని, రాత్రి సమయంలో తన స్నేహితురాలి వద్దకు వెళ్తానని చెప్పింది. ఈ క్రమంలో గురువారం ఉదయం ఆమె అక్క ఫోన్ చేయగా లిఫ్ట్ చేయలేదు. దీంతో నగరానికి బయలుదేరిన తన భర్తకు సమాచారం ఇచ్చింది. అతడు ఇంటికి చేరుకుని తలుపులు కొట్టినా స్పందన లేకపోవడంతో గడియ తొలగించి చూడగా బెడ్‌రూమ్‌లో ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సీఐ జె.మురళి సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. విచారణ తర్వాత పూర్తి వివరాలు వెల్లడిస్తామ సీఐ పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా బుధవారం కళాశాలలో మామూలుగానే ఉందని, రెండు రోజుల కిందట అరకు వెళ్లి వచ్చామని అప్పుడూ సాధారణంగానే ఉందని పోలీసులకు శిరీష స్నేహితులు తెలిపారు.

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు


స్తంభాలు వేస్తున్న దృశ్యం

ఇచ్ఛాపురం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): 17వ వార్డు గాంధీనగర్‌లో విద్యుత్ శాఖ అధికారులు ఎట్టకేలకు విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. దీంతో వార్డు ఇన్‌చార్జి, టీడీపీ నాయకులు జన్నెల సంతోష్ తోపాటు స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా కాలనీలో సరిపడంత విద్యుత్ స్తంభాలు లేకపోవడంతో వెలుతురు సరిగ్గాలేక రాత్రిపూట దొంగతనాలతో స్థానికులు ఇబ్బంది పడేవారు. కాలనీ సమస్యలపై పలుమార్లు వార్డు ఇన్‌చార్జి సంతోష్ సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో ఇన్నాళ్లకు స్పందించారు.

ముగిసిన శిక్షణ

గార, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పంచాయతీ అభివృద్ధికి సంబంధించిన ప్రణాళిక రూ పొందించడానికి ఉద్దేశించి గత నాలుగు రోజులుగా స్థానిక మండలం పరిషత్ కార్యాలయంలో నిర్వ హించిన శిక్షణ గురువారంతో ముగిసింది. సర్పంచ్‌లు, కార్యదర్శులు, మండల స్థాయి అధికారులకు శిక్షణ ఇచ్చారు. ఎంపీడీవో ఎస్.రామ్మోహన్‌రావు, ఈవోపీఆర్డీ కూర్మారావు, ఏవో రఘుతో పాటు రీసోర్స్ పర్సన్స్ శిక్షణలో పాల్గొన్నారు.

మెనూ సక్రమంగా అమలు చేయాలి


ఆశ్రమ పాఠశాలను పరిశీలిస్తున్న ఐటీడీఏ ఏపీవో

సరుబుజ్జిలి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న ఆహారం విషయంలో మెనూ సక్రమంగా అమలు చేయాలని సీతంపేట ఐటీడీఏ ఏపీవో జి.చిన్నబాబు అన్నారు. గురువారం ఆయన మండలంలోని వెన్నలవలస గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో తనిఖీలు నిర్వహించారు. విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రభుత్వ నిబంధనలు మేరకు మెనూ ప్రకారం ప్రతిరోజూ ఆరోగ్యకరమైన భోజనం అందించడానికి చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులకు అందించే తాగునీరు ఆర్వో ప్లాంట్ పనితీరును పరిశీలించి పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉండేటట్టు చర్యలు తీసుకోవాలని హెచ్ఎంను ఆదేశించారు. ఎంఈవో డి.బాలరాజు, సిబ్బంది పాల్గొన్నారు.





28లోగా ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ పూర్తి చేయాలి

శ్రీకాకుళం రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): ఈ నెల 28వ తేదిలోగా 0-6 ఏళ్ల లోపు చిన్నారుల ఆధార్ ఎన్‌రోల్‌మెంట్ పూర్తిచేయాలని ఎంపీడీవో బి.శైలజ అన్నారు. సచివాలయ సిబ్బందికి, ఏఎన్ఎం, వెటర్నరీ అసిస్టెంట్, అగ్రికల్చర్ అసిస్టెంట్, వీఆర్వోలకు గురువారం మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహించారు. కొంత మంది అగ్రికల్చర్ అసిస్టెంట్లు డుమ్మా కొట్టడంపై ఎంపీడీవో శైలజ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమం కోసం క్షేత్రస్థాయిలో తీసుకోవాల్సిన చర్యలపై ఏర్పాటు చేసిన శిక్షణా తరగతులకు డుమ్మా కొట్టడం ఉద్యోగ నిర్లక్ష్యమని అటువంటి వారి వివరాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. 19, 20 తేదీల్లో సింగుపురం, ఒప్పంగి, రాగోలు గ్రామాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే ఈ నెల 26 నుంచి 28 వరకు మూడు రోజుల పాటు ఆధార్ కేంద్రాలు కొనసాగుతాయన్నారు. మిగిలిన రోజుల్లో కనుగులవానిపేట, సింగుపురం, లంకాం ప్రాంతాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో ఈవోఆర్డీ కె.సూర్యనారాయణ, సూపరింటెండెంట్ రమణ తదితరులు పాల్గొన్నారు.





అభివృద్ధి పనులకు నిధులు

బూర్జ, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చి ఆరు నెలల్లోనే గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ పట్టింది. ఇందులో భాగంగా టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణ ఆధ్వర్యంలో పెద్దపేట గ్రామాభివృద్ధికి నిధులు మంజూరు చేయించారు. ఈ పంచాయతీ పరిధిలో పెద్దపేట, కొండపేట, నీలాపురం, మదనాపురం, జగన్నాథపురం, బొమ్మిక గ్రామాలు ఉన్నాయి. ఈ పంచాయతీ అభివృద్ధికి రూ.54.64 లక్షలు నిధులు వెచ్చించారు. ప్రధానంగా గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైన్ల నిర్మాణానికి సర్పంచ్ ఆనెపు వరలక్ష్మి శ్రీకారం చుట్టారు. ఎన్నో దశాబాల కాలంగా నిర్లక్ష్యానికి గురైన రోడ్లుకు ఎట్టకేలకు మోక్షం లభించిందని పంచాయతీ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పూర్వ విద్యార్థుల సాయం

ఆమదాలవలస, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): బెలమాం గ్రామానికి చెందిన అదపాక రాము కుమారుడు దేవి వరప్రసాద్ (10) ప్రమాదానికి గురై చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం తెలుసుకున్న రాముతో కలిసి చదువుకున్న పూర్వ విద్యార్థులు కొంత మొత్తాన్ని సమకూర్చి తమ ఉదారతను చాటుకున్నారు. వివరాల్లోకి వెళ్తే.. దూసిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002-03 విద్యా సంవత్సరంలో పదో తరగతి చదువుతున్న పూర్వ విద్యార్థులు తమతో చదువుకున్న చిన్ననాటి స్నేహితుడు రాముకు ఆర్థికసాయం అందించారు. రాము కుమారుడు సైకిల్ తొక్కుతూ ప్రమాదానికి గురై.. సైకిల్ హ్యాండిల్ గుండెకు బలంగా తగలడంతో శస్త్ర చికిత్స చేయాలని వైద్యులు తెలిపారు. దీంతో పూర్వ విద్యార్థులు రామకృష్ణ, జితేంద్ర, లక్ష్మీనారాయణ కలిసి రూ.67,500 సేకరించి గురువారం రాము కుటుంబానికి అందజేశారు.

బీమా పరిహారం అందజేత

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): విధి నిర్వాహణలో ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయిన హోంగార్డు కాంతారావు కుటుంబానికి యాక్సిస్ బ్యాంక్ అందించిన ప్రమాద బీమా పరిహారం రూ.34 లక్షలు చెక్కును ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అందజేశారు. ఈ మేరకు గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలోని ఎస్పీ చాంబర్‌లో కాంతారావు భార్య లక్ష్మికి చెక్కును ఎస్పీ అందించారు. కార్యక్రమంలో ఏఎస్పీ(అడ్మిన్) కేవీ రమణ, కార్యాలయ ఏవో సీహెచ్ గోపినాథ్, బ్యాంక్ ప్రతినిధులు పాల్గొన్నారు.





పంచాయతీ.. నగరమయ్యేదెపుడో!

- నగర పంచాయతీ కోసం గతంలో టీడీపీ ప్రణాళిక
- కూటమి ప్రభుత్వంలో మళ్లీ కసరత్తు ముమ్మరం


నరసన్నపేట పట్టణ వ్యూ..

నరసన్నపేట, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి)

జిల్లాలోని మేజర్ పంచాయతీగా గుర్తింపు పొందిన నరసన్నపేట నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ కోసం ఎదురుచూస్తోంది. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ కసరత్తుచేస్తోందని సమాచారం. పేట పంచాయతీలో పెద్దబొరిగివలస, చిన్నబొరిగివలస, జమ్ము, తామరాపల్లి, గొట్టిపల్లి, కరగాం పంచాయతీలను విలీనం చేసేందుకు ప్రణాళిక సిద్ధంచేస్తున్నారు. గత ఐదేళ్లలో నరసన్నపేట పంచాయతీల్లో జనాభా పెరగడంతో పాటు ఆదాయం దాదాపు రూ.1.50 కోట్లు రావడంతో నగర పంచాయతీహోదాకు సరిపడే అర్హతలు ఉన్నాయని మునిసిపల్ పరిపాలనశాఖ భావిస్తోంది. నరసన్నపేట పట్టణంలో చిన్నబొరిగివలస, పెద్దబొరిగివలస, గొట్టిపల్లి పంచాయతీల్లో విస్తరించిన నేపథ్యంలో కూటమి ప్రభుత్వం ఈ మూడు పంచాయతీలను నగర పంచాయతీలో విలీనం చేసేందుకు ముమ్మరంగా కసరత్తుచేస్తోంది.

ఇదీ నరసన్నపేట స్వరూపం..

వీధులు : 88
గృహాలు : 12,356
జనాభా : 48,532
వార్షిక ఆదాయం : రూ.1.54 కోట్లు
బ్యాంకులు : 17
బీమా కార్యాలయాలు : 5
జీఎస్టీ కార్యాలయం: 12 మండలాలు

జిల్లాలో ముడు పంచాయతీలు..

జిల్లాలోని నరసన్నపేట, టెక్కలి, సోంపేట మేజర్ పంచాయతీలను నగర పంచాయతీలుగా మార్చేందుకు 2014-19లో టీడీపీ ప్రభుత్వ హయంలో ప్రణాళికలు సిద్ధం చేశారు. అప్పటిల్లో సాధారణ ఎన్నికల దగ్గరకు రావడంతో ఈ పక్రియ నిలిచిపోయింది. వైసీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తర్వాత ఈ పక్రియ మూలకుచేరింది. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువుతీరిన తర్వాత మళ్లీ నరసన్నపేట, టెక్కలి, సోంపేట మేజర్ పంచాయతీలు నగర పంచాయతీలుగా అప్‌గ్రేడ్ చేసుందుకు ప్రభుత్వం యత్నిస్తోంది. ఈమేరకు ఇప్పటికే ఆయా పంచాయతీల్లో వార్షిక ఆదాయం, జనాభా, పంచాయతీ సిబ్బంది, భౌగోళిక స్వరూపం వాటి వివరాలు సేకరించేందుకు అధికారులు సమయత్తమవుతున్నారు.

విస్తరిస్తున్న వ్యాపార, విద్యాసంస్థలు..

జిల్లాలో శ్రీకాకుళం తర్వాత నరసన్నపేట వ్యాపారపరంగా అభివృద్ధి చెందింది. రైస్ మిల్లులు, బంగారం షాపులు, వస్త్ర దుకాణాలు, స్టీల్, ప్లాస్టిక్ హోల్‌సేల్ వ్యాపారాలు ఎక్కువగా జరుగుతున్నాయి. దీనికితోడు నరసన్నపేట నుంచి ఇతర ప్రాంతాలకు పలు రకాల సామగ్రి ఎక్కువగా ఎగుమతులు అవుతాయి. నరసన్నపేట కేంద్రంగా రైస్, స్టీల్, బంగారం మూడు రాష్ట్రాల్లో వ్యాపారాలు సాగుతున్నాయి. దీంతో వ్యాపారపరంగా బాగా అభివృద్ధి చెందడంతో నరసన్నపేటలో ఒకప్పుడు నాలుగు బ్యాంకులు ఉండగా ప్రస్తుతం 15 వరకు ప్రభుత్వ ప్రైవేటు బ్యాంకులు ఉన్నాయి. అలాగే సుమారు 27 విద్యాసంస్థలు నిర్వహిస్తున్నారు. ఇప్పుడిప్పుడే నిర్మాణ రంగం అభివృద్ధిచెందుతుండడంతో రోజుకు ఐదు వేలు మంది వరకు కార్మికులు ఉపాధి పొందుతున్నారు. హమాలీలు, పలు ప్రైవేటు చిన్నతరహా పరిశ్రమల్లో రోజుకు మరో రెండువేలు మంది వరకుపనిచేస్తున్నారు. వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్న నరసన్నపేట పట్టణం పంచాయతీగా ఉండడంతో నిదుల సమస్యతో సతమతంకావడంతో అభివృద్ధికి ఆమాడ దూరంలో నిలిచింది.

అటు ట్రాఫిక్.. ఇటు ఆక్రమణలు

నరసన్నపేటలో సమస్యలు పాగావేశాయి. నిత్యం మెయిన్‌రోడ్డుపై ట్రాఫిక్ సమస్య వేధిస్తోంది. స్థానిక పల్లిపేట జంక్షన్ నుంచి సత్యవరం జంక్షన్ వరకు రోడ్లు విస్తరించినా రోడ్లు మీద వందలాది తోపుడు బళ్లు, వీధి వ్యాపారాలతో ఆక్రమణలకు గురవుతున్నాయి. అలాగే కళాశాల రోడ్లు, మఠంవీధి, బజారువీధి తదితర వీధుల్లో రోడ్లు ఇరుగ్గా ఉండడంతో అత్యవసర సమయంలో అంబులెన్స్‌లు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. ఇక వర్షం కురిస్తే మురుగునీరు ఇళ్లు, రోడ్లు మీద ప్రవహిస్తోంది. డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేదు. టీడీపీ ప్రభుత్వ హయంలో ఏర్పాటుచేసిన అండర్ డ్రైనేజ్ వ్యవస్థను వైసీపీ హయంలో సక్రమంగా నిర్వహించకపోవడం, మెయిన్ రోడ్డులో డ్రైనేజీలపై అక్రమ నిర్మాణాలతో మూసుకుపోవడం, తాగునీరు సమస్య, పారిశుధ్య సమస్యలతో కొట్టుమిట్టాడుతోంది. ఇంత పెద్దపట్టణానికి ఒక పార్కు కూడా లేకపోవడం, పేట వాసులు వినోదానికి దూరమవుతున్నారు. ఈ తరుణంలో నగర పంచాయతీగా మోక్షం కలిగితే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే నిధులతో అభివృద్ధిలో బాటలో నరసన్నపేట నిలుస్తుందని పట్టణవాసులు చెబుతున్నారు.

నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ చేయాలి..



నరసన్నపేట పట్టణాన్ని రాజకీయాలకతీతంగా అభివృద్ధి చెందేందుకు నగర పంచాయతీగా అప్‌గ్రేడ్ చేయాలి. పట్టణం ఇటు జమ్ము జంక్షన్ అటు గొట్టిపల్లి, బొరిగివలస వరకు విస్తరించింది. ఒక్క పార్కు లేదు. డ్రైనేజ్ వ్యవస్థ సరిగా లేదు. నగర పంచాయతీగా చేస్తే మరింత అభివృద్ధి చెందే అవకాశం ఉంటుంది.

-ఎం.ఆర్ జ్యోతిఫెడ్రరిక్, రిటైర్డు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, నరసన్నపేట

ప్రాణాలు కాపాడిన హెల్మెట్

- ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు
- తండ్రీకొడుకులకు గాయాలు

నరసన్నపేట, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): జమ్ము గ్రామ శివారుల్లో గురువారం ఉదయం ఓ కారు.. ఆటోను క్రాస్ చేసేందుకు ప్రయత్నించగా ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఈక్రమంలో వాహనం నడుపుతున్న కుమారుడు హెల్మెట్ ధరించడంతో ప్రాణాలతో బయటపడ్డాడు. వెనుక కూర్చొన్న తండ్రి ఎగిరిపోయి కారు వెనుకభాగంలో పడి గాయపడ్డాడు. పోలీసులు, స్థానికుల కథనం మేరకు.. కోటబొమ్మాళి మండలంలోని ఊడికిలపాడుకు చెందిన తండ్రీకొడుకులు వావలపల్లి తవిటియ్య, సింహాచలం నారాయణవలస సంతకు ఆవుకొనేందుకు ద్విచక్రవాహనంపై వెళ్తున్నారు. సారవకోట మండలంలోని కోదడ్డపనసలోని ఆర్మీ జవాన్ కారు ముందు వెళ్తున్న ఆటోను క్రాస్‌చేసే సమయంలో ఎదురుగా వస్తున్న ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనాన్ని కారు కొంత దూరం ఈడ్చుకెళ్లింది. అయితే వాహనం నడుపుతున్న సింహాచలం కుడిచేయి, చాతీపై బలమైన గాయాలు కాగా, హెల్మెట్ ధరించడంతో తలపై స్వల్పంగా గాయాలతో బయటపడ్డాడు. దిచక్రవాహనం వెనుకభాగంలో కూర్చొన్న తండ్రి తవిటియ్య కారు ఢీకొన్న వెంటనే కారు అద్దం మీదపడి తర్వాత కారు వెనుకపడ్డాడు. దీంతో తల, నడుం భాగంపై గాయాలయ్యాయి. ప్రమాదం జరిగిన వెంటనే జమ్ము గ్రామానికి చెందిన యువత సంఘటన ప్రాంతానికి చేరుకొని అపస్మారకస్థితిలో ఉన్న సింహాచలానికి సపర్యాలు చేశారు. 108 వాహనంలో నరసన్నపేట సర్వజన ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. సింహాచలం ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు. సంఘటన స్థలాన్ని ఏఎస్‌ఐ అసిరినాయుడు పరిశీలించారు.

త్రుటిలో తప్పిన పెను ప్రమాదాలు

జిల్లాలో గురువారం రెండు వేర్వేరు ఘటనల్లో పెను ప్రమాదాలు త్రుటిలో తప్పాయి. ఎల్.ఎన్.పేట మండలంలోని ముంగెన్నపాడు జంక్షన్‌లో ట్రాక్టరును ఆర్టీసీ బస్సు ఢీకొంది. నరసన్నపేట మండలంలోని గుండువిల్లిపేట జాతీయరహదారిపై లారీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది.

ట్రాక్టరును ఢీకొన్న ఆర్టీసీ బస్సు


నుజ్జునుజ్జైన బస్సు ముందుభాగం

ఎల్.ఎన్.పేట, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి):మండలంలోని అలికాం-బత్తిలి ప్రధానరోడ్డుపై ముంగెన్నపాడు జంక్షన్ సమీపంలో గురువారం ట్రాక్టరును ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో బస్సులోని ప్రయాణికులు, డ్రైవరు, కండక్టర్, ట్రాక్టర్ డ్రైవర్ సురక్షితంగా బయటపడడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. స్థానికులు, ప్రయాణికుల కథనం మేరకు.. లక్ష్మీనర్సుపేట వైపు నుంచి సరుబుజ్జిలి వైపు ఇసుక ట్రాక్టరు వస్తోంది. అదే సమయంలో కొత్తూరు నుంచి శ్రీకాకుళం వస్తున్న పైవ్‌స్టాప్ ఎక్స్‌ప్రెస్ ముంగెన్నపాడు జంక్షన్ వద్ద ట్రాక్టరును తప్పించే క్రమంలో బస్సుడ్రైవర్ వేగం పెంచాడు. దీంతో రోడ్డుకు పడమర వైపున చెట్టు ఉండడంతో ట్రాక్టరు వెనుక భాగాన్ని బస్సు ఢీకొంది. ట్రాక్టరు రోడ్డుకు అడ్డంగా తిరిగిపోయి ట్రక్కు బోల్తాపడడంతో ఇసుకంతా రోడ్డుపై పడిపోయింది. బస్సు ముందు భాగం అద్దాలు పగిలిపోయి నుజ్జునుజ్జయ్యింది.అయితే బస్సులో ప్రయాణికులంతా సురక్షితంగా బయటపడ్డారు.ఏ ఒక్కరికీ గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

లారీ అదుపు తప్పి.. డివైడర్‌ను ఢీకొని


డివైడర్‌పైకి దూసుకెళ్లిన లారీ

నరసన్నపేట, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గుండువిల్లిపేట జాతీయరహదారిపై గురువారం త్రుటిలో పెనుప్రమాదం తప్పింది. స్థానికుల కథనం మేరకు..ఒడిశాలోని ఖుర్దా నుంచి విశాఖపట్నం ప్లైఉడ్ సామగ్రితో వస్తున్న లారీ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొంది. దీంతో విద్యుత్ స్తంభాలు నెలకొరిగాయి. అయితే ఆ సమయంలో ప్రజలు లేకపోవడంతో పెనుప్రమాదం తప్పింది. నేషనల్ హైవే అధికారులు సంఘటన ప్రాంతానికి చేరుకొని విద్యుత్‌పంపిణీ నిలిపివేశారు.

బస్సు బోల్తాపడి 12 మందికి గాయాలు

పలాస రూరల్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామకృష్ణాపురం జాతీయరహదారి వద్ద ఒడిశాకు చెందిన తీర్థయాత్ర బస్సు ప్రమాదవశాత్తు గురువారం ఉదయం బోల్తాపడింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న 12మంది తీర్థయాత్రికులు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు ఈ విషయాన్ని 108కు సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరి వారికి చికిత్సచేశారు. చలి అధికంగా ఉండడం, మంచు వల్ల వేగంగా వస్తున్న బస్సు బోల్తాపడినట్లు స్థానికులు తెలిపారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేశారు. కాగా బోల్తాపడిన బస్సును జాతీయరహదారి నిర్వాహకులు యంత్రంతో రోడ్డుపైకి తీసుకువచ్చారు.

హెచ్‌ఎం, డిప్యూటీ వార్డెన్లకు చార్జ్‌మెమో

టెక్కలి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): టెక్కలిలోని ఆదీఆంధ్రా వీధిలో గల గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను గురువారం ఐటీడీఏ డీడీ అన్నదొర తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టార్ నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో హెచ్‌ఎం అప్పారావు, డిప్యూటీవార్డెన్ గణపతిరావులకు చార్జ్‌మెమో జారీచేశారు. వంటగది, స్టోర్ రూము, సరుకుల వివరాలు,విద్యార్థుల మెనూను పరిశీలించారు. తరగతిగదులు శుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.

పాఠశాలల్లో వినియోగదారుల వారోత్సవాలు

పలాస రూరల్/కాశీబుగ, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): పాఠశాల స్థాయిలో ఈ నెల 24వ తేదీ వరకూ వినియోగదారుల వారోత్సవాలు నిర్వహించనున్నట్లు జిల్లా వినియోగదారుల క్లబ్ మాస్టర్ ట్రైనర్ ఎల్‌వీ చలం తెలిపారు. గురువారం కాశీబుగ్గలో విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 24 వరకు పాఠశాల స్థాయిలో రోజువారీ ప్రణాళికలో భాగంగా ప్రతిజ్ఞ, ర్యాలీ, 2019 రక్షణ చట్టం, డిజిటల్ లావాదేవీలు ఆహార కల్తీ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని డీఈవో తిరుమల చైతన్య ఆదేశాలు జారీచేశారని చెప్పారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలు జిల్లాస్థాయిలో బాలికల పాఠశాలల్లో శుక్రవారం నిర్వహించనున్నట్లు తెలిపారు.

జగన్నాథపురంలో శ్మశానం భూమి పరిశీలన


జగన్నాథపురం గ్రామస్థులతో మాట్లాడుతున్న రెవెన్యూ అధికారులు

పలాసరూరల్, డిసెంబరు19(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగన్నాథపురానికి చెందిన శ్మశాన భూమిలో కొందరు ఆక్రమణలకు పాల్పడడంతో రెవెన్యూ అధికారులు గురువారం పరిశీలించారు. శ్మశానంలో ఆక్రమణలు జరిగాయని గ్రామస్థులు ఇటీవల వినతిపత్రం అందజేయడంతో రెవెన్యూ అధికారులు ఆక్రమణ స్థలం నిర్ధారించి తొలగించేందుకు చర్యలు చేపట్టారు. ఈ కార్య క్రమంలో తహసీల్దార్ కళ్యాణచక్రవర్తి, సర్వేయరు గిరి, వీఆర్వో కంచరాన ఖగేశ్వరనాయుడు పాల్గొన్నారు.

సబ్ ట్రెజరీ కార్యాలయంలో తనిఖీ

టెక్కలి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): టెక్కలి సబ్‌ట్రెజరీ కార్యాలయాన్ని డీడీ సీహెచ్ రవికుమార్ గురువారం తనిఖీచేశారు. ఈ సందర్భంగా కార్యాలయంలోని రికార్డులు, సిబ్బంది పనితీరు పరిశీలించి ఆరాతీశారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ల బృందం ఎం.తులసీరావు, టి.సునీత, పి.చంద్రశేఖర్, శ్రీధర్, ఏటీవో రామకృష్ణ, ఎస్‌టీవో భాగ్యలక్ష్మి, గోవిందమ్మ, మన్మథరావు, శిరీష, గాంధీ పాల్గొన్నారు.

ఐటీడీఏ ఏర్పాటు చేయండి: ఎంజీఆర్

పాతపట్నం/మెళియాపుట్టి/అరసవల్లి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి):మెళియాపుట్టిలో ఐటీడీఏ ఏర్పాటుచేయాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. ఈ మేరకు కేంద్ర గిరిజనవ్యవహారాలశాఖ మంత్రి జుయల్ ఓరంను ఢిల్లీలో విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడుతో గురువారం కలిశారు. ఈసందర్భంగా గిరిజన జనసాంద్రత ఎక్కువగల గల పాతపట్నం నియోజకవర్గంలో ఐటీడీఏ ఏర్పాటు ఆవశ్యకతను వివరించారు. ఐటీడీఏ ఏర్పాటుపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎంజీఆర్ తెలిపారు.

శతశాతం ఉత్తీర్ణతే లక్ష్యం కావాలి


మెనూ పరిశీలిస్తున్న బాలాజీ

పాతపట్నం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): పదో తరగతి ఇంటర్‌లో శతశాతం ఉత్తీర్ణత సాధించడమే లక్ష్యం కావాలని సాంఘికసంక్షేమగురుకులాల జిల్లా సమన్వయాధికారి ఎన్.బాలాజీ కోరారు. గురువారం స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల ఆశ్రమపాఠశాలలో పరిసరాలు, డార్మెటరీ, మరుగుదొడ్లు వంటశాల, భోజననిర్వహణలను పరిశీలించారు. అనంతరం బోధన సిబ్బందితో మాట్లాడారు. శతశాతం ఉత్తీర్ణతసాధనకు ప్రణాళికలు రూపొందించుకోవాలని కోరారు. ఆయనవెంట ప్రిన్సిపాళ్లు వి.అర్చన, డి.దేవేంద్రరావు ఉన్నారు.

మెళియాపుట్టిలో టీడీపీ సభ్యత్వ నమోదు


మెళియాపుట్టి: సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

మెళియాపుట్టి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మెళియాపుట్టి టీడీపీ సభ్యత్వ కార్యక్రమాన్ని గురువారం పార్టీ మాజీ మండలాధ్యక్షుడు అనపాన రాజశేఖరెడ్డి నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ సభ్యత్వం ఉంటే గౌరవం ఉంటుందని తెలిపారు.

- సంతబొమ్మాళి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాడు పంచాయతీలో గురువారం టీడీపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు అట్టాడ రాంప్రసాద్ పాల్గొన్నారు.

తోపుడు బల్లు వ్యాపారుల నిరసన


టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న తోపుదు బల్లు వ్యాపారులు

టెక్కలి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి):పోలీస్, పంచాయతీ యంత్రాంగం వల్ల తమ బతుకులు వీధిన పడడంతో ప్రత్యామ్నాయం చూపించి ఆదుకోవాలని తోపుడుబల్లు వ్యాపారులు కోరారు. ఈ మేరకు తోపుడుబల్లుపై చిరువ్యాపారాలు చేసుకునే వారు ఇందిరాగాంధీ కూడలి నుంచి అంబేడ్కర్ కూడలి మీదుగా సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.అనంతరం అక్కడ నిరసన తెలిపి, తమ సమస్యలను ఆర్డీవో ఎం.కృష్ణమూర్తికి వివరించారు.కార్యక్రమంలో చిన్నమ్మడు, సీత, మల్లి, నీలవేణి, వరదరాజులు, మాధవరావు, సీపీఎం నాయకులు నంబూరు షణ్ముఖరావు, కొల్లి ఎల్లయ్యలు పాల్గొన్నారు.

పనితీరు మెరుగుపరుచుకోవాలి: ఆర్డీవో


మాట్లాడుతున్న కృష్ణమూర్తి

టెక్కలి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): క్షేత్ర స్థాయిలో అధికారులు పనితీరు మెరుగుపరుచుకోవాలని ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి కోరారు. గృహనిర్మాణశాఖ లక్ష్యాలను వేగవంతంగా అమలు చేయాలని తెలిపారు. గురువారం టెక్కలి సబ్‌కలెక్టరేట్‌లో డివిజన్ స్థాయి ప్రత్యేకాధికారులు, మండల ప్రత్యేకాధికారులు, గృహ నిర్మాణశాఖ సిబ్బందితో సమీక్షించారు. టెక్కలి డివిజన్‌లో 242 ఇళ్ల కాలనీ లేఅవుట్లలో వేగవంతంగా నిర్మాణాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐటీడీఏ డీడీ అన్నదొర పాల్గొన్నారు.

కాశీబుగ్గ ఫ్లైఓవర్ నిర్వాసితులకు పరిహారం

పలాస రూరల్, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ ఫ్లైఓవర్ నిర్వాసితుల్లో పరిహారం అందని వారికి అకౌంట్‌లో నగదు జమచేస్తామని ఆర్డీవో గ్రంధి వెంకటేష్ తెలిపారు. గురువారం పలాస రెవెన్యూడివిజన్ కార్యాలయంలో ఆర్‌వోబీ నిర్వాసితులతో సమావేశం నిర్వహించారు. 128 మంది నిర్వాసితుల్లో పదిమంది వరకూ పరిహారం అందలేదని, సాంకేతిక లోపాలతో పరిహారం పంపిణీకి ఇబ్బందులుఎదురయ్యాయని, వారికి పరిహారం అందజేస్తామని అధికారులు తెలిపారు.తమకు స్థలాలు అందలేదని నిర్వాసితులు సమావేశం దృష్టికి తీసుకురాగా వాటిని త్వరలో కొలిక్కి తీసుకువస్తామని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ కళ్యాణచక్రవర్తి, ఆర్‌అండ్‌బీ ఏఈ విక్రమ్ పాల్గొన్నారు.

పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు :ఈఈ


పనులు పరిశీలిస్తున్న అధికారులు

జలుమూరు, డిసెంబరు 19: (ఆంధ్రజ్యోతి) పనుల్లో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవని క్వాలిటీ కంట్రోల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు యూవీ ప్రసాద్ హెచ్చరించారు. జలుమూరు నుంచి సుబ్రమణ్యపురం మీదుగా బుడితి వరకు నిర్మిస్తున్న బీటీరోడ్డు పనులు గురువారం తనిఖీ చేశారు. ఆయన వెంట క్వాలిటీ కంట్రోలు డీఈ ప్రదీప్, పీఆర్ డీఈ జి.సత్యంనాయుడు, ఏఈ శ్రీధర్ ఉన్నారు.

అర్హులందరికీ పక్కా ఇళ్లు మంజూరు

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): అర్హులందరికీ పక్కాఇళ్లు మంజూరు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని అగ్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరరావు తెలిపారు. గురువారం పూండి- గోవిందపురంలో ఇంటింటా హౌసింగ్ అధికారులతోకలిసి సర్వేలోనిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీనాయకులు కర్ని రమణ పాల్గొన్నారు.

పాఠశాలకు శానిటరీ సామగ్రి పంపిణీ

నందిగాం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలలకు ఎంఆర్‌సీకి చేరిన శానిటరీ సామగ్రిని గురువారం ఎంఈవో-1 జి.నర్సింహులు ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేశారు. 14 ఉన్నత, ఆరు యూపీ, 76 ప్రాథమిక, కేజీబీవీ బాలికల గురుకులం, గిరిజన ఆశ్రమ పాఠశాలలకు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు.

సుస్థిరాభివృద్ధిలో ఉద్యోగులు కీలక పాత్ర పోషించాలి

నందిగాం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సుస్థిరాభివృద్ధిలో సచివాలయ ఉద్యోగులు కీలకపాత్ర పోషించాలని ఎంపీడీవో టి.రాజారావు కోరారు. గురువారం నందిగాంలో సుస్థిరాభివృద్ధి లక్ష్యాలపై సర్పంచ్‌లు, కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి.

- కోటబొమ్మాళి, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్, వెలుగు కార్యాలయాల్లో నిర్వహించిన మండలస్థాయి అధికారులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి నిర్వహించిన శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. ఈ కార్య క్రమంలో ఎంపీడీవో కుప్పిలి ఫణీంద్రకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చెదలు పట్టి.. శిథిలావస్థకు చేరి

- బిక్కుబిక్కుమని విధులు నిర్వహిస్తున్న సిబ్బంది
- ఇదీ కోటబొమ్మాళిలోని వంశధార సెక్షన్ కార్యాలయం పరిస్థితి


శిథిలావస్థకు చేరిన వంశధార సెక్షన్ కార్యాలయం

కోటబొమ్మాళి, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): కోటబొమ్మాళిలోని వంశధార సెక్షన్ కార్యాలయం చెదలుపట్టి శిథిలావస్థకు చేరింది. ఆరు దశాబ్దాల కిందట నిర్మించిన ఈ భవనానికి కనీస మరమ్మతులు సైతం లేకపోవడంతో గోడలు బీటలు వారాయి. కార్యాలయం మొత్తం శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలుతుందోనని భయాందోళనతో ఉద్యోగులు బిక్కుబిక్కుమని విధులు నిర్వహిస్తున్నారు.ఇందులో కేవలం ఒక్క గది మాత్రమే వర్షానికి కారకపోవడంతో కార్యాలయం ఇక్కడే నిర్వహిస్తున్నారు. అయితే అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో శిథిలావస్థకు చేరిన గదుల్లో కొంత కాలం సంచార జాతులు కాలనుగుణంగా వచ్చి నివాసముంటున్నారు. వారు కూడా గదుల దుస్థితి చూసి వెళ్లిపోతున్నారు. తక్షణమే వంశధార అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి నూతన భవన సముదాయాన్ని నిర్మించాలని లస్కర్లతో పాటు పలువురు కోరుతున్నారు.

నేటి నుంచి వాహనాల దారి మళ్లింపు

జలుమూరు, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): చల్లవానిపేట నుంచి నరసన్నపేట వెళ్లే వాహనాలు జర్జంగి మీదుగా శుక్రవారం నుంచి దారి మళ్లిస్తున్నట్లు తహసీల్దార్ జన్ని రామారావు తెలిపారు. తిలారు రైల్వే గేటు వద్ద ఫ్లైఓవర్ పనుల నేపథ్యంలో 20 రోజులపాటు చల్లవానిపేట కూడలి నుంచి జర్జంగి మీదుగా నరసన్నపేట వాహనాలను మళ్లించనున్నట్లు పేర్కొన్నారు.నరసన్నపేట నుంచి సారవకోట వెళ్లే వాహనాలను జమ్ము కూడలి నుంచి నిమ్మాడ, జర్జంగి మీదుగా చల్లవానిపేటకు మళ్లిస్తున్నట్లు తెలిపారు. జాతీయరహదారి అధికారులు వినతి మేరకు జిల్లా అధికారులు అనుమతి ఇచ్చినట్లు పేర్కొన్నారు. వాహనచోదకులు గమనించి వంతెన పనులకు ఆటంకం లేకుండా సహకరించాలని ఆయన కోరారు.

నేడు ఆధార్ డ్రైవ్

వజ్రపుకొత్తూరు, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి): పూండి- గోవిందపురం సచివాలయంలో శుక్రవారం ఆధార్‌డ్రైవ్ నిర్వహించనున్నట్లు అగ్నికులక్షత్రియ కార్పొరేషన్ డైరక్టర్ పుచ్చ ఈశ్వరరావు, టీడీపీ మండల ప్రధానకార్యదర్శి కర్ని రమణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చిన్నపిల్లల ఆధార్ కార్డుల్లో తప్పుల సవరణ చేపట్టనున్నట్లు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నందిగాం, డిసెంబరు 19(ఆంధ్రజ్యోతి): మండలంలోని మదనాపురం సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని టెక్కలి విద్యుత్ ఈఈ జి.శంకరరావు తెలిపారు. దీనబంధుపురం, మదనాపురం, హర్షబాడ ఫీడర్ల విద్యుత్ లైన్లలో కొమ్మలు తొలగింపు, మెంటినెన్స్ దృష్ట్యా ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండుగంటల వరకు నౌగాం, రధజనబొడ్డపాడు, కల్లాడ,హర్షబాడ, దీనబంధుపురంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

విద్యార్థులకు వైద్య పరీక్షలు

జలుమూరు, డిసెంబరు 19: (ఆంధ్రజ్యోతి) పరీక్షలు నిర్వహించి వ్యాధులు నిర్ధారించిన తరువాత ఏడు శాతం మంది విద్యార్థులను పెద్ద ఆసుపత్రులకు రిఫర్ చేయాలని రాష్ట్రీయ బాల స్వాస్థ జిల్లా ప్రోగ్రాం అధికారి ఇ.వెంకటరావు తెలిపారు. తిమడాం ఉన్నతపాఠశాల విద్యార్థులకు గురువారం స్క్రీనింగు పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే జిల్లా కోఆర్డినేటర్ అప్పలనాయుడు, వైద్యాధికారి హేమలత, ఆరోగ్య విస్తరణాధికారి శిమ్మ సోమేశ్వరరావు, ఏఎన్‌ఎం ఎం.రంగమ్మ పాల్గొన్నారు.

విద్యార్థులకు గణిత పరీక్షలు

వజ్రపుకొత్తూరు, డిసెంబరు19 (ఆంధ్రజ్యోతి):పూండి- గోవిందపురం పాఠశాలలో ఐదో తరగతి విద్యార్థులకు గణిత పరీక్షలు నిర్వహించారు. 135 మంది పరీక్షను రాశారని గణిత ఉపాధ్యాయుడు చింత ఉమారావు చెప్పారు.25 మందిని ఎంపిక చేశామని, ఇందులో మొదట స్థానంలో నిలిచిన ఐదుగురుని ఎంపిక చేసి గణిత దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తామని తెలిపారు.

ఆధార్ కేంద్రం ప్రారంభం

హిరమండలం, డిసెంబరు 19 (ఆంధ్రజ్యోతి): సుభలయ అంగన్‌వాడీ కేంద్రంలో ఏర్పాటుచేసిన ఆధార్‌కేంద్రాన్ని జడ్పీటీసీ పి.బుచ్చిబాబు ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్‌వాడీకేంద్రాల్లో ఆధార్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.